# బ్రతుకాట

రాచపూటి రమేష్

"మనిషన్నాక పది చోట్ల తిరగాల, పదిమందిని తెలిసిపెట్టుకొనుండాల. నన్ను ముట్టుకోకు నా మాలకాకి' అన్నట్లుంటే ఈ కాలం ఎవ్వరూ నిన్ను మతించరు. ఎమ్మెస్సీ పాసైనా ఆ మారుమూల పల్లెటూర్లో కుదురుకోని మట్టి పిసుకుతావుండావు. కాదన్ను-కనీసం ఇట్లా సిటీకి వచ్చినప్పుడైనా నలుగుర్నీ పలకరించొద్దా" కారు స్టీరింగ్ పట్టుకొని ఒడుపుగా డ్రైవ్ చేస్తూ, అవసరమైనప్పుడల్లా చకచకా గేర్లు మారుస్తూనే అన్నాడు సుధీర్. కారు పెద్దమ్మగుడి వద్ద మలుపు తిరిగి కొండపైకి పాకడం ప్రారంభించింది. పెద్దకొండరాళ్లమధ్య కట్టిన భవంతులు దీపాల వెలుతురులో దేదీప్యమానంగా మెరిసిపోతున్నాయి.

"మీ జిల్లా మంత్రితో నాకేం పని?" కొంచెం విసుగ్గానే అన్నాను.

"ఆ పెడసరమే ఒద్దనేది, నువ్వేం పెద్ద భూస్వామికాదు. 'పదిహేనెకరాల మెట్ట, ఐదెకరాల మామిడి తోపే' కదా నీకు దిక్కు. అందుకే గదా వచ్చినపని ఐపోగానే నా పాటికి నేను బయల్దేరకుండా నీ దగ్గరకు వచ్చింది" కారు విండోలోంచి కనబడుతున్న' విశాలమైన షాపింగ్ మాళ్లనూ, అద్దాల్లోంచి, ధగధగా మెరిసిపోతూ కనిపిస్తున్న దుకాణాల్లోని బట్టల వరుసలను చూస్తూ అన్నాడు.

కారు జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ దాటి మాదాపూర్ వైపు వేగంగా వెళుతోంది. పండుగరోజులు, శలవుదినం కూడా కావడంతో సాయంత్రపు వేళ తీరిగ్గా షాపింగ్ చేసే జన సందోహం కూడా బజార్లలో ఎక్కువగానే ఉంది. ట్రాఫిక్‌ని నియంత్రించలేక సిగ్నల్‌లైట్ల వద్ద నిలుచున్న పోలీస్ కానిస్టేబుళ్లు తెగ ఇబ్బంది పడుతున్నట్లున్నారు.

"మనం వెళుతన్నది గోల్డెన్ రిసార్ట్స్‌లో ఈవెనింగ్ పార్టీకి. గోల్డెన్ క్లబ్ రిసార్ట్స్ అంటే సిటీలోని ప్రెస్టీజియస్ క్లబుల్లో ఒకటి. అక్కడి మెంబర్లంతా అరిస్ట్రోక్రాటిక్ ఫామిలీలనుంచి వచ్చినవాళ్లు. సంఘంలో మంచి పేరు ప్రతిష్ఠలున్నవాళ్లు. కొందరు ఎమ్మెల్యేలూ, ఎంపీలు కూడా అక్కడికి రావచ్చు. వీలైతే మీ జిల్లా ఇంఛార్జి మినిష్టర్‌ని కూడా నీకు అక్కడ పరిచయం చేస్తాను" అతివృష్టి, అనావృష్టుల మధ్య వ్యవసాయం ఈ రోజు పెద్ద జూదంగా మారింది. దెబ్బ తింటే ఆదుకొనేందుకు నీ కెవరూ లేరు. 'జడ్‌పిటీసీల' ఎలక్షను రాబోతోంది. మినిస్టరు ప్రాపకం సంపాదించి, మీ ఏరియాకి సీటు సంపాదిస్తివనుకో, నీ రాతే మారిపోతుంది" అన్నాడు సుధీర్ జేబులోంచి మోగుతున్న సెల్‌ఫోన్ బయటకు తీస్తూ.

"నాకే ఎలక్షనూ వద్దూ, పదవులూ వద్దు. ఇప్పుడున్న జీవితమే హాయిగా వుంది" అన్న నా మాటను పట్టించు కోకుండా సుధీర్ సెల్‌ఫోన్ ఎడమ భుజానికీ, చెవికీ మధ్య తమాషాభంగిమలో ఇరికించుకొని మాట్లాడసాగాడు.

హలో, సుధీర్‌నే, చెప్పు గురూ, ఆ! ఐయామ్ ఆల్రెడీ లేట్, ఒప్పుకుంటాను, బట్ ఐ హావే గుడ్ రీజన్, కృష్ణమూర్తని నా చైల్డ్ హుడ్ ఫ్రెండ్‌లే, చాలా అనెక్స్ పెక్టెడ్‌గా వచ్చాడు, ఎప్పుడూ రానివాడు, పార్టీ చూసినట్లుంటుందని వాణ్నీ లాక్కొస్తున్నాను. ఇంకేంటి గురూ, ఫైర్ వర్క్స్ స్టార్టయ్యాయా? మహేషూ, ధ్యాన్‌చంద్ వచ్చేసారా? కరమ్‌గాడు దిగబడ్డాడా, మేడమ్ మాధురీ సంగతేంటి..."



కొండపై నుంచి వెలుగుతున్న లైట్ల వెలుతురులో నగరం కార్తీకమాసంలో నదిలో వదిలిన దీపాలవరుసను గుర్తుకు తెస్తోంది. సాయంత్రం ఏడుగంటలకే సన్నగా చలిపోరుతోంది. ఒక ఆటో పెద్దగా హారన్ మోగించుకుంటూ మా కార్ స్కూల్ పిల్లలు సడెన్ బ్రేక్‌తో కార్ ఆపాడు సుధీర్. ఒక త్రాచుపాము రోడ్డు దాటుతూ ఉంది.

"ఒకప్పుడీ ఏరియా మొత్తం పాములమయం గురూ. ఇప్పుడు దీని రూపురేఖలే మారిపోయాయి. గజం లాండ్ వేయ్యి చుక్కలనంటుతూ ఉంటుంది" అన్నాడు.

సెల్‌ఫోన్‌లో మాట్లాడినప్పుడు సుధీర్ మామూలుగా, నాతో మాట్లాడినప్పుడు మా ప్రాంతం యాసలో మాట్లాడ్డం గమనించాను. బహుశా నన్నింకా ప్రిమిటివ్‌గానే జమ కట్టున్నాడేమో.

డిగ్రీలో, ఎమ్మెస్సీలో నేనూ, సుధీర్ క్లాస్‌మేట్స్‌మి. ఆంధ్రా యూనివర్సిటీలో ఇద్దరం ఒకే గైడ్ దగ్గర రిసెర్చ్‌లో జాయినయ్యాం. కొన్ని కారణాల వల్ల నేను సంవత్సరం తరువాత రిసెర్చ్ ఆపుచేసి ఇంటివద్ద పొలాలు చూసుకోవలసి వచ్చింది. నాన్న అరోగ్యంతో మంచం పట్టడం, తమ్ముడు మరో ప్రాంతంలో ఉద్యోగం చేస్తూవుండడంతో ఇంటి బాధ్యతలూ, వ్యవసాయ బాధ్యతలు నేనే చేపట్టవలసి వచ్చింది.

సుధీర్ మాత్రం రీసెర్చ్ పూర్తి చేసిన సంవత్సరంలోనే హైదరాబాద్‌లోని యూనివర్సిటీలో లెక్చరర్‌గా జాయినై పోయాడు. పదేళ్ల సీనియారిటీని ఆసరాగా చేసుకొని ఈ నాటికి రీడర్‌స్థాయికి ఎదిగాడు, వాడి పెళ్లికి ఆరేళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చాను నేను. మళ్లీ రెండు మూడు సార్లు నగరానికి వచ్చినా సుధీర్‌ను కలుసుకోవడం కుదరలేదు. మా మేనమామ కుమారుడికి పెళ్లి సిటీలో జరుగుతుండడంతో రెండు రోజుల క్రితమే ఇక్కడకు వచ్చాను. మా గ్రామానికి పది పడకల ఆసుపత్రి ఒకటి మంజూరు చేసుకోవాలని, మరికొందరు గ్రామస్థులతో కలిసి నిన్నంతా మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్లో గడిపాము. ప్రజల కాంట్రిబ్యూషన్ తగినంత వున్నా మేచింగ్‌గ్రాంట్ రిలీజ్ అవడంలో ఆలస్యం జరుగుతోంది. ఆ పనితోనే నిన్న బాగా పొద్దుపోయే వరకూ మా గ్రామస్థులతో గడిపి, నిన్న రాత్రి అఫ్జల్‌గంజ్‌లోని ఓ లాడ్జిలో గది తీసుకున్నాను. ఈ రోజు బిర్లామందిర్ లాంటి గుళ్లూ, గోపురాలు చూసి, కోఠీలోనూ, జీపీఓ వద్ద సెకెండ్ హేండ్ బుక్స్ కొని తిరగేసి, సాయంత్రం ఏడింటికి బస్సెక్కి తిరుపతి చేరుకొని, అక్కడ నుంచి మా ఊరికి ప్రయాణం కట్టాలనుకున్నాను. ఉదయం యధాలాపంగా సుధీర్‌కి ఫోన్ చేశాను. ఆదివారం కాబట్టి ఫ్రీగానే ఉన్నాడు సుధీర్. తానుండగా, లాడ్జిలో బస చేసినందుకు ఫోన్లోనే ముక్క చివాట్లు పెట్టాడు. కార్లో లాడ్జి వద్దకు చేరుకొని రూం ఖాళీ చేయించి, పెట్టే, బేడాతో సహా వాళ్లింటికి తీసికెళ్లిపోయాడు. సుధీర్ భార్య కూడా ఏదో ఇన్సూరెన్స్ కంపెనీలో జాబ్ చేస్తోంది. పెద్దింటి బిడ్డ, ఆవిడ. పిల్లలిద్దరూ నాతో కలగొలుపుగా మాట్లాడారు. మధ్యాహ్నాం భోజనంతో బాటూ స్వీటూ, ఐస్‌క్రీం, కేసరి తినిపించాడు సుధీర్. సాయంత్రం ఏడింటికి ఇలా గోల్డెన్ రిసార్ట్స్‌లో పార్టీకి బయలు దేరదీశాడు. మర్నాడు నాకు ఊరి దగ్గర ఎంతర్జెంటు పనులున్నాయన్నా వినిపించుకోలేదు సుధీర్. రాత్రి పదకొండింటింకి నాంపల్లి నుండి బయలుదేరే ఒక స్పెషల్ ట్రెయిన్ గూడూరు మీదుగా చెన్నైకి వెళ్తుందట. ట్రావెల్ ఏజెన్సీకి ఫోన్ చేసి నాకా ట్రెన్‌లో గూడూరు వరకు రిజర్వేషన్ టికెట్టు తెప్పించాడు. గూడూరు నుంచీ మా ఊరికి గంట ప్రయాణమే కాబట్టి నేను అట్టే బెట్టు చేయలేదు.

> **ఖరీదైన సఫారీసూట్లూ, పఠాన్‌కోట్లూ, టీషర్ట్స్, స్లీవ్‌లెస్, షాట్స్, సిల్కుచీరలు, చుడీదార్లు, గాగ్రాచోళీలు, ఎటుచూసినా కనకమహాలక్ష్మి నాట్యం చేస్తున్నట్లు ఉంది. సాదాసీదా కాటన్ షర్ట్, ప్యాంట్‌లలో షూస్, టక్ లేకుండా ఉన్న నాలాంటి వారు అరుదుగా ఉన్నారక్కడ.**

"పార్టీకి రకరకాల మనుషులు వస్తుంటారు. అసలా అట్మాస్ఫియరే డిఫరెంట్‌గా ఉంటుందిలే. నువ్వక్కడ బెల్లంకొట్టిన రాయిలా బిగుసుకు పోకుండా ఫాస్ట్‌గా మూవ్ ఔతూ ఉండాలి. సంభాషణలో చురుగ్గా పాల్గొనాలి నీకా టాపిక్ తెలిసినా తెలియకపోయినా." సుధీర్ మాటలతో ఇహలోకంలోకి వచ్చాను.

"తెలియని విషయాలేం మాట్లాడుతాం? నేను డిగ్రీ చదివేటప్పుడు ఒక సాహిత్య సమ్మేళనానికి వెళ్లాను. మాటల్లో ఒక కవి 'రామయణకల్పవృక్షం' రాసినదెవరని అడిగాడు. నేను ఠక్కున 'రంగనాయకమ్మ' అన్నాను. అక్కడ కూర్చున్న వారంతా గొల్లుమని నవ్వారు. తరువాతెవరో కలవృక్షం రాసింది విశ్వనాథ వారనీ, రంగనాయకమ్మ రాసింది 'రామయణ విషవృక్షమ'నీ చెప్పారు. తెలియని టాపిక్ మాట్లాడితే ఇలానే ఉంటుంది" అన్నాను నవ్వుతూ.

సుధీర్ జేబిలోంచి డన్‌హిల్స్ ప్యాక్ తీసి ఒక సిగరెట్ వెలించాడు. సిగిరెట్ తాగుతూనే వేగంగా డ్రైవ్ చేయసాగాడు.

"అక్కడ నువ్వు 'విషవృక్షం' రాసిన 'రంగనాయకమ్మ' పేరు చెప్పడంతో సాహిత్యంతో నీకంతో, ఇంతో టచ్ ఉన్న విషయం బోధపడుతుంది. అసలే మాట్లాడకుండా ఊరుకున్నావనుకో నీకా టాపిక్ గురించి బొత్తిగా తెలియదనుకుంటారు.

హడ్లీ ఛేజ్ గురించైనా హార్స్‌రేసు గురించైనా నీకు తోచింది ఏదో ఒకటి వాగుతూవుండు. అప్పుడే నీకు రికగ్నిషన్ ఉంటుంది" అన్నాడు.

నాకు సుధీర్ వాదన నచ్చలేదు. మౌనంగా ఊరుకున్నాను. ఇప్పుడర్జంటు రికగ్నిషన్ సంపాదించాలన్న దుగ్ధ నన్నేమీ పట్టిపీడించడం లేదు.

సిటీ లిమిట్స్ దాటి ఇరవై మైళ్లు వచ్చాక రోడ్డు కొక వైపు 'వెల్కమ్ టు గోల్డెన్ రిసార్ట్స్' అన్న అక్షరాలు దూరం నుంచి కనిపించేలా అందంగా రాళ్లపై చెక్కబడి ఉన్నాయి. గేటు దగ్గర చౌకీదార్ అభివాదం అందుకొని సుధీర్ కిక్కిరిసిన పార్కింగ్ లాట్‌లో చోటు వెతుక్కుని కారును పార్క్ చేశాడు. లోపల కోలాహలానికీ, జన సందోహానికి గుర్తుగా రాక్ మ్యూజిక్ తారాస్థాయిలో బయటకు వినిపిస్తోంది.

కారు దిగి బెరుగ్గా చూస్తున్న నన్ను చేయిపట్టుకొని రిసార్ట్స్ భవనంవైపు తీసుకెళ్లాడు సుధీర్. ఇరువైపులా చక్కగా అమర్చిన క్రోటన్స్, పూలకుండీల వరుసను దాటుకొని స్వింగ్‌డోర్స్ తెరుచుకొని ఇద్దరం రిసార్ట్స్‌లోకి అడుగుపెట్టాం. సెంట్రలైజ్డ్ ఏసీ ఏమో చల్లటిగాలి రివ్వున తాకింది.

కాలేజీలోనూ, యూనివర్సిటీలో కూడా కల్చరల్ ఆక్టివిటీస్‌లో చురుగ్గా పాల్గొన్నవాణ్ని కాదు. ఇక మా పల్లెటూరి సంగతి

సరేసరి, "రచ్చబండ రాజకీయాలూ, పేపర్లలోని వార్తా కథనాలు, కొత్తసినిమాల కబుర్లు" తప్ప అక్కడ వేరే కబుర్లు దొర్లవు. దగ్గరలోని టౌనుకు అప్పుడప్పుడూ వెళ్లినా అక్కడి మా మిత్రబృందం" ఫైనాన్స్ కంపెనీల అరచకాలు, తండాల మోసాలు, చావులూ, పెళ్లిళ్లా జాతరలు" వంటి 'కరెంట్ అఫైర్స్' మాత్రమే చర్చించేవి. ఇటువంటి వాతావరణం నాకు పూర్తిగా కొత్త.

ఖరీదైన సఫారీసూట్లూ, పఠాన్‌కోట్లూ, టీషర్ట్స్, స్లీవ్‌లెస్, షాట్స్, సిల్కుచీరలు, చుడీదార్లు, గాగ్రాచోళీలు, ఎటుచూసినా కనకమహాలక్ష్మి నాట్యం చేస్తున్నట్లు ఉంది. సాదాసీదా కాటన్ షర్ట్, ప్యాంట్‌లలో షూస్, టక్ లేకుండా ఉన్న నాలాంటి వారు అరుదుగా ఉన్నారక్కడ.

"హలో సుధీర్, ఏమిటంత ఆలస్యం, అదే నీ స్టూండెటెవరైనా నీ క్లాసుకు లేటుగా వచ్చాడనుకో, నువ్వూరు కుంటావా?" సఫారీ సూట్‌లో బానకడుపులో ఉన్న బట్టతల శాల్తీ నవ్వుతూ అడిగాడు.

"ఊరుకోను. యూ ఆర్ టూ ఎర్లీ ఫర్ మై నెక్స్ట్ క్లాస్" అనుండేవాడిని చెప్పాడు సుధీర్ నవ్వుతూనే. "బైదిబై మట్ మై ఫ్రెండ్ కృష్ణమూర్తి" అని నన్ను బానకడుపు వ్యక్తికి పరిచయం చేశాడు. నవ్వుతూనే కరచాలనం చేశాను.

ఎవరికి వారు గుంపులు గుంపులుగా విడిపోయి జోక్స్, పిట్టకథలతో సరదాగాకాలక్షేపం చేస్తున్నారు. కేంప్‌ఫైరు చుట్టూ కొందరు యువతీ యువకులు డాన్స్ చూస్తూ పాటలు పాడుతున్నారు. "మిరుమిట్లు, గొలిపే విద్యుద్దీపాలంకరణా, చెవుల్లో చిల్లులు పొడుతున్న జాజ్ డ్రమ్స్ మోత, విచిత్ర వేషాలంకరణతో కొందరూ, జగ్లర్స్, ఫైర్ ఈటర్స్, ట్రెపీజ్ ఆర్టిస్ట్స్. నాకెందుకో ఆ వాతావరణంలో ఏదో అసహజత్వం, కృత్రిమత్వం గోచరించింది. దానికన్నా మా వూరిలోని గంగ జాతరలోనే 'ఆత్మీయతా' అనురాగస్పర్శ ఉండవచ్చు.

"హలో ధ్యాన్‌చంద్, ఇనపెట్టె గలగలాడుతూ ఉన్నట్లుంది. మంచి ఉషారుగా ఉన్నావ్?" అడిగాడు సుధీర్ పిల్లికళ్లు, కొనదేలిన ముక్కుతో సన్నగా రివటలా ఉన్న వ్యక్తిని.

"సూపర్ మేన్‌లా ఎగురుకుంటూ వచ్చాడు. బైదిబై 'సూపర్‌మేన్' సినిమాను చూశారా కృష్ణమూర్తి గారు?" బానకడుపుతో ఉన్న సఫారీ సూటతను నన్నుఅడిగాడు పలకరింపుగా.

తనడిగేది ఎన్టీఆర్ నటించిన సూపర్‌మేనా, ఇంగ్లీష్ చిత్రమా అర్థం కాలేదు నాకు." చూశాను. బ్రూస్‌రోడ్ బాగా చేశాడు" అన్నాను తడబడుతూ

ధ్యాన్ చంద్ సఫారీ సూట్‌వాలా. మరో ఇద్దరు మహిళలూ పగలబడి నవ్వారు. "బ్రూస్‌రీడ్ ఆస్ట్రేలియాకు చెందిన ఫాస్ట్ బౌలర్ క్రికెట్‌లో. సూపర్‌మేన్‌గా చేసింది క్రిస్టఫర్ రీవ్, గుర్రం మీద నుండి పడి మంచం పట్టి ఈ మధ్యనే చనిపోయాడు" అన్నారు.

నేను పేరు తప్పుగా చెప్పినా. వారంతలా నవ్వడం నాకేం నచ్చలేదు. అంతలో సుధీర్ నా చెయ్యి పట్టుకొని దూరంగా లాక్కుపోయి ఒక ఖద్దరు షర్ట్ వాలాను పరిచయం చేశాడు.

ఖద్దరు షర్ట్ చుట్టూ ----మాగధ దళం చాలా మందే ఉన్నారు. నా కతన్ని ఎక్కడో చూసినట్లు లీలగా గుర్తొచ్చింది. హఠాత్తుగా మెరుపు మెరిసినట్లైంది. ఎరువుల కుంభకోణంలో ప్రముఖ పాత్ర వహించి కోట్లకు పడగలెత్తినట్లు చాలా పేపర్లు ఆ మధ్య విరివిగా రాశాయతని గురించి

"గంట ముందే వచ్చేవాణ్ని. జలియన్ వాలా బాగ్‌లో ఇరుక్కున్నాను" అన్నాడు గంభీరంగా. చుట్టూవున్న వాళ్లు అర్థంకానట్లు మొఖం పెట్టారు.

"జలియన్ వాలా బాగ్ అంటే తెలియదా? ట్రాఫిక్ జామయ్యా సుధీర్ బాబూ" అని పెద్దగా నవ్వాడు. "ఈ జనరల్ ----- రెవరయ్యాబాబూ" అని నన్ను చూసి ఎగతాళిగా అడిగాడు" సుధీర్‌ను.

"నేను డయ్యార్‌ను కాను అతణ్ని చంపిన భగత్‌సింగ్" అన్నాను కసిగా.

"డయ్యార్‌ను చంపింది భగత్‌సింగ్ కాదు, ఉధమ్‌సింగ్ అనే ఇంజనీరింగ్ స్టూడెంటు" అన్నాడు పక్కన నిలబడివున్న మరో కళ్లజోడతను. సుధీర్ పని చేసే యూనివర్సిటీనే అతను హిస్టరీ ప్రొఫెసరట. నాకు తల కొట్టేసినట్లైంది. రానంటే బలవంతంగా లాక్కొచ్చాడు సుధీర్. హెడ్‌వెయిట్ మనుషులే ఎక్కువున్నట్లు ఉన్నారీ పార్టీలో.



తలనొప్పిగా ఉండి కూల్‌డ్రింక్ తాగుదామని దూరంగా వెళ్లాను. రంగులు విరజిమ్ముతూ ఉందొక ఫౌంటెను. దాని చుట్టూ పచ్చని చెట్లూ, రకరకాల పూలు.

"లూయిస్ పమ్ స్ట్రాంగ్ వర్క్ బావుంటుంది. హి ఈజ్ సచే జీనియస్" అంటుందొక అమ్మాయి నా పక్కనే నా పక్కనే నాతోబాటు కూల్‌డ్రింగ్ తాగుతున్న సుధీర్‌తో కూల్‌డ్రింక్ తాగుతూ నా వంక చురుగ్గా చూశాడు సుధీర్. బాటిల్ కింద పెడుతూ కార్లో సుధీర్ చేసిన గీతోపదేశాన్ని గుర్తుకు తెచ్చుకున్నాను.

"పమ్‌స్ట్రాంగ్ నిజంగా గొప్పవాడు. మొదటి సారి చంద్రుడిపై కాలు మోపడమంటే మాటలు కాదు" తడుముకోకుండా చెప్పాను.

ఆ అమ్మాయి కిసుక్కున నవ్వింది.

సుధీర్ నా వైపు కోపంగా చూశాడు "నీల్ ఆమ్ స్ట్రాంగ్ వేరు. మ్యూజిక్ వినబడ్డం లేదా? ఏమ్ స్ట్రాంగంటే జాజ్ మ్యూజిక్‌ను ప్రపంచమంతా పాపులరైజ్ చేసిన వ్యక్తి" అని నాతో అని, "మా వాడంతే లెండి, ఎల్విస్ ప్రీస్లీ అంటే ఒక సైంటిస్ట్ అనుకుంటాడు" అని తేల్చి పారేశాడు. నాకు మండుకొచ్చింది.

"అందుకే పేపర్లు చదవాలి, టీవి చూడాలనేది" అన్నాడు.

"నేను వస్తున్నది పార్టీ కనుకున్నాను కానీ ఏ జనరల్ నాలెడ్జి పరీక్షకో అనుకుంటే ప్రిపైరై వచ్చేవాడిని" అన్నాను. సుధీర్ నా మాటలు పట్టించుకునే స్థితిలోనేడు. రిమ్ లెస్ కళ్లజోడు ధరించి నేవీ బ్లూ రేమాండ్ సూట్‌లో ఉన్న ఒక ఆజానుబాహుణ్ని గబగబా వెళ్లి రిసీవ్ చేసుకుంటున్నాడు. సూట్ ధరించిన వ్యక్తి పక్కన బ్రీఫ్‌కేసు పట్టుకొని ఒక బంట్రోతు, డైరీ, కాగితాల కట్ట పట్టుకొని మరో సెక్రటరీ లాంటి వ్యక్తీ ఉన్నారు. చూపుల బట్టి ఆయన ఏ అయ్యేఎస్ ఆఫీసరో అనుకున్నాను. కాదట, మోనార్క్ ఛానెల్ అధినేత కృపాకర రెడ్డి అట. వారి సూపర్‌హిట్ టెలీసీరియల్ అత్తాకోడళ్ల సవాల్ రెండువందల వారాలు కంప్లీట్ చేసుకున్న సందర్భంలో ఇచ్చిన పార్టీయేనట ఇది.

(కథారచయిత ఫోన్-**9866727042**)

(సశేషం)